సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 2 । ఏప్రిల్ । 2025



పీలేరులో భారీ చోరీ

పీలేరులో చోరీ జరిగింది. రెండిళ్లలో రూ. 10 లక్షల నగదు, అర కిలో బంగారు నగలు, మూడు కిలోల వెండి చోరీ అయింది.

-8లో



ఒంటిమిట్టలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.136
రెండోరకం	రూ.80	రూ.100

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 140 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఉచిత శిక్షణ

రాయచోటి జగదాంబసెంటర్: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతులకు టైలరింగ్, బ్యూటీపార్లర్‌లలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కెనరా బ్యాంకు రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఎం.ఆరీఫ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 ఏళ్ల మధ్య వయస్సు గల మహిళలు ఈ శిక్షణకు అర్హులని ఆయన పేర్కొన్నారు. దూర ప్రాంతాల వారికి ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 94409 05478, 99856 06866 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ప్యాసింజర్ రైళ్ల వేళలు మార్పు

కలికిరి: తిరుపతి–గుంతకల్, గుంతకల్–తిరుపతి ప్యాసింజర్ రైళ్లు నడిచే వేళల్లో రైల్వే శాఖ మార్పులు చేసింది. గతంలో గుంతకల్ ప్యాసింజర్(57403) తిరుపతిలో ఉదయం 8.10 గంటలకు ప్రారంభంకానుండగా ప్రస్తుతం తిరుపతిలో ఉదయం 6.45 గంటలకు టైం టేబుల్ మార్చారు. ఈ మేరకు పాకాలకు 7.30, పీలేరు 8.10, కలికిరికి 8.25, మదనపల్లి రోడ్ 8.55గం .లకు, మొలకలచెరువుకు 9.35 గంటలకు, కదిరికి 10.15 గంటలకు, ధర్మవరంకు మధ్యాహ్నం 12 గంటలకు, అనంతపురం 12.50కి, గుంతకల్‌కు 3.30 గంటలకు చేరుకుంటుంది. గుంతకల్‌లో ప్రతి రోజు బయలుదేరు తిరుపతి ప్యాసింజర్(57404) రైలు గతంలో ఉదయం 6 గంటలకు బయలుదేరుతుండగా ప్రస్తుతం ఉదయం 8 గంటలకు బయలుదేరుతుంది. అనంతపురానికి ఉదయం 9.15 గంటలకు, ధర్మవరానికి 10.05 గంటలకు, మొలకలచెరువుకు 11.55 గంటలకు, మదనపల్లి రోడ్‌కు మధ్యాహ్నం 12.40 గంటలకు, కలికిరికి 1.10 గంటలకు, పీలేరు 1.25 గంటలకు, పాకాలకు 2.20 గంటలకు, తిరుపతికి సాయంత్రం 4.55 గంటలకు చేరుకుంటుంది. ప్రయాణీకులు నూతన టైంటేబుల్‌ను గమనించాలని రైల్వే అధికారులు కోరారు.

బియ్యపు గింజపై శ్రీరామ నామం



భక్తులను ఆలయ మర్యాదలతో స్వాగతిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట: ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామికి మంగళవారం రాయచోటి పట్టణానికి చెందిన భక్తులు శ్రీరామనామం మలచిన బియ్యపు గింజలను సమర్పించినట్లు ఆలయ టీటీడీ అధికారులు తెలిపారు. రాయచోటి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రాయచోటి పట్టణానికి చెందిన బలసరజనీ, పుష్పహాస్ అనే భక్తులు జనవరి ఒకటో తేది నుండి తమ స్వహస్తాలతో శ్రీరామ నామం మలచిన 10,011 బియ్యపు గింజలను మంగళవారం ఒంటిమిట్ట రామయ్యకు సమర్పించారు. ముందుగా వారికి ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికి, ప్రదక్షణ గావించి గర్భాలయంలోని మూలమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి వారు తీసుకువచ్చిన రామనామం మలచిన బియ్యపు గింజలను స్వామివారి చెంతన ఉంచారు. ఈ భక్తులను ఒంటిమిట్ట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు సోమిశెట్టి మనోహర్ బాబు ఘనంగా సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ బియ్యపు గింజల తలంబ్రాలను ఒంటిమిట్టలో జరిగే సీతారాముల కల్యాణం రోజున ముత్యాల తలంబ్రాలలో కలపనున్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వల్లం కొండు వెంకట సుబ్బయ్య, సభ్యులు కిరణ్ కుమార్, గౌరవ అధ్యక్షులు మధుసూదన్, సంఘం సభ్యులు వారిని సత్కరించారు.

కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు



ఎఫ్ఏలకు ప్యాకెట్లు అందిస్తున్న ఎంపీడీఓ, ఏపీఓ

సాక్షి ఎఫెక్ట్..

బి.కొత్తకోట: జిల్లాలో ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై మంగళవారం సాక్షిలో 'ఉపాధి కష్టాలు' శీర్షిక కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై బి.కొత్తకోట ఎంపీడీఓ దిలీప్‌కుమార్, ఉపాధి ఏపీఓ వెంకటేశ్వర్లు స్పందించారు. స్థానిక సీహెచ్‌సీ కేంద్రానికి వెళ్లి ఎండల కారణంగా ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాల్సి ఉందని వైద్యులకు వివరించారు. దీంతో మూడు పెట్టెల ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. వీటిని ఎంపీడీఓ కార్యాలయానికి తీసుకొచ్చి ఉపాధి క్షేత్ర సహాయకులకు పంపిణీ చేశారు. కూలీలు పని చేస్తున్న చోట ప్యాకెట్లను అందుబాటులో ఉంచి వాటిని నీళ్లలో కలిపి అందించాలని దిలీప్‌కుమార్, వెంకటేశ్వర్లు ఎఫ్ఏలకు సూచించారు. ప్యాకెట్లను ఇంకా సేకరించి కూలీలకు నిత్యం అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పేదలపై కూటమి కన్నెర్ర

- అభాగ్యుల పింఛన్ల కోత
- కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో 6,615 పింఛన్ల తొలగింపు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జూన్‌లో 2,23,436 పింఛన్లు
- కూటమి ప్రభుత్వంలో ఏప్రిల్ పింఛన్లు 2,16,821
- సచివాలయాల్లో చేసుకున్న దరఖాస్తులపై నిర్లక్ష్యం



బి.కొత్తకోట: ప్రభుత్వాలు ఏ పథకాన్ని అమలు చేసినా ఏనెలకానెల లబ్ధిదారుల సంఖ్య పెరుగుతుంది. ఇది సాధారణంగా జరిగేదే అయినా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్ల ప్రక్రియ తిరోగమనం బాట పట్టింది. ప్రతినెలా పింఛన్ల సంఖ్యలో కోతలు పెడుతూ వస్తోంది. కొత్త పింఛన్లు ఇవ్వని ప్రభుత్వం మనగడలో ఉన్న పింఛన్లపై పగ పట్టింది. వీటిపై ఆధారపడిన పేదలు ఇప్పుడు ఆదుకునే వారి కోసం ఎదురుచూస్తున్నారు. సచివాలయాల ద్వారా దరఖాస్తులు చేసుకున్న వారికి దిక్కులేకుండా పోయింది. దీంతో కొత్త పింఛన్ల మంజూరు దేవుడెరుగు ఉన్న పింఛన్లు పీకేస్తున్నారంటూ పేదలు గగ్గోలు పెడుతున్నారు.

ఆధారం కోల్పోయి..

జిల్లాలో పింఛన్లు కోల్పోయిన లబ్ధిదారులు నెలనెలా అందే రూ.4వేల పింఛన్‌తో జీవనం సాగించేవారు వందలసంఖ్యలో ఉన్నారు. పింఛన్ సొమ్ము లబ్ధిదారులకు సామాజిక భద్రతను కల్పించేది. ఎవరి ఆదరణ ఉన్నా.. లేకున్నా నెలంతా పింఛన్ సొమ్ముతో జీవిస్తున్న వారి సంఖ్యకు కొదవ లేదు. వైద్యం, నిత్యావసర వస్తువుల కోసం పింఛన్ సొమ్మును ఖర్చు పెట్టుకునేవాళ్లున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులైన పేదలకు అండగా నిలిచి పింఛన్లను నిరంతరంగా మంజూరు చేస్తూ వచ్చింది. ప్రస్తుత పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా తయారైంది.

రూ.23 కోట్లు మిగుల్చుకున్న ప్రభుత్వం: జిల్లాలో పింఛన్లను కోతపెట్టిన ప్రభుత్వం గత 9 నెలల్లో అభాగ్యులకు అందించాల్సిన రూ.23.81 కోట్ల పింఛన్ సొమ్మును మిగుల్చుకుంది. గత జూలైలో 2,23,436 పింఛన్లు ఉండగా ఆగస్టు నెలలో 1,123 పింఛన్లను తొలగించారు. అక్కడినుంచి ప్రతినెలా కొంతమేరకు కోతవేస్తూ ప్రస్తుతం మొత్తం 6,615 పింఛన్ల తొలగింపు స్థితికి తీసుకొచ్చారు.

వాళ్లు చనిపోయారట: పింఛన్ల కోతపై ఓ అధికారి వింత సమాధానం విస్తుపోయేలా చేస్తోంది. ఒక సందర్భంలో పింఛన్ల కోతపై ఓ అధికారి వివరణ కోరితే.. వారు చనిపోతున్న లబ్ధిదారులని, అందుకే తొలగిస్తున్నామని చెప్పుకొచ్చారు. అయితే గత ఆగస్టునెలలో 1,123 మంది చనిపోయారా అన్న ప్రశ్నకు సమాధానం లేదు. ఆ అధికారి అభిప్రాయం ప్రకారం పింఛన్లు తొలగిపోతున్న వాళ్లంతా చనిపోతున్న వాళ్లే అయితే ఈ తొమ్మిది నెలల్లో తొలగించిన పింఛన్ల లెక్క మేరకు 6,615 మంది చనిపోయి ఉండాలి. చనిపోయిన వ్యక్తుల మరణ ధృవీకరణ లెక్కలు బయటకు తీస్తే ఈ లెక్క వస్తుందా అన్నది పెద్దప్రశ్న. ఇంతమంది చనిపోయే ఆస్కారం లేదని స్పష్టంగా తెలుస్తుంది.

ఆ దరఖాస్తులపై కక్ష

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే మూడు నెలల ముందునుంచే అర్హులైన పింఛన్‌దారులు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ దరఖాస్తులను సిబ్బంది ఆన్‌లైన్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ దరఖాస్తుల పరిశీలన, మంజూరు చేసే ప్రక్రియ చేపట్టలేదు. దీనికితోడు ఆ దరఖాస్తుల స్థితి ఏమిటో కూడా దర ఖాస్తుదారులకు తెలియదు. వేలసంఖ్యలో చేస్తున్న దరఖాస్తుల వాస్తవ సంఖ్య తెలియకుండా సచివాలయాల్లో సేవలను నిలిపివేయడంతో తెలుసుకోలేని పరిస్థితి నెలకొంది.

పింఛన్ల కోత వివరాలు	
జూన్ - 2024	2,23,436
జూలై - 2024	2,23,436
ఫిబ్రవరి - 2025	2,18,157
మార్చి - 2025	2,17,388
ఏప్రిల్ - 2025	2,16,821



రాకతోనే కోతలు మొదలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్లపై దండెత్తింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చివరి నెల జూన్ ఒకటిన జిల్లాలోని లబ్ధిదారులకు 2,23,436 పింఛన్లు పంపిణీ చేశారు. ఇవే పింఛన్లు కొనసాగించాల్సిన ప్రభుత్వం ప్రతినెలా కోతలు విధించుకుంటూపోతోంది. గత జూలైలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన పింఛన్లను యధావిధిగా పంపిణీ చేసిన కూటమి ప్రభుత్వం ఆ తర్వాతి నెలనుంచే కోతలు మొదలుపెట్టింది. దీనిఫలితంగా గత ఆగస్టు నెల నుంచి ప్రస్తుత ఏప్రిల్ దాక 6,615 మంది పింఛన్లను తొలగించారు. ఈ స్థాయిలో పింఛన్లు కోల్పోయిన నిరుపేదలు, అనాధలు, నిరాదరణకు గురైన అభాగ్యులు తమకిక దిక్కేది అంటూ ప్రశ్నిస్తున్నారు. భారీసంఖ్యలో పింఛన్లు తొలగిపోయినా అధికార కూటమి ప్రభుత్వం అందుకు ప్రత్యామ్నయంగా పింఛన్ల మంజూరు చేపట్టలేదు.

ఏప్రిల్-25 పింఛన్ల వివరాలు

మండలం	లబ్ధిదారులు
నిమ్మనపల్లె	5,027
రామాపురం	4,988
రాయచోటి	4,625
రామసముద్రం	6,371
కలకడ	5,408
కంభంవారిపల్లె	6,768
రాజంపేట	7,457
మదనపల్లె(అర్బన్)	10,790
బి.కొత్తకోట	7,770
పుల్లంపేట	4,967
రాజంపేట(అర్బన్)	3,156
ములకలచెరువు	6,571
చిట్వేలి	5,533
పెద్దమండ్యం	5,423
తంబళ్లపల్లె	6,104
వాయల్పాడు	6,700
లక్కిరెడ్డిపల్లె	4,541
కలికిరి	6,896
పీలేరు	9,627
నందలూరు	3,995
గుర్రంకొండ	5,955
రాయచోటి అర్బన్	8,234
పెనగలూరు	5,035
మదనపల్లె	14,004
గాలివీడు	7,008
కురబలకోట	6,366
చిన్నమండెం	5,012
కోడూరు	10,017
సంబేపల్లె	5,593
ఓబులవారిపల్లె	6,263
టి.సుండుపల్లి	7,594
వీరబల్లి	5,224
పీటీసముద్రం	7,799

వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించాలి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్ర నాయక్

రాయచోటి టౌన్: వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించాలని, అందుకు ప్రభుత్వం కూడా సహకరిస్తోందని అన్నమయ్యజిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రనాయక్ అన్నారు. మంగళవారం రాయచోటి వ్యవసాయశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీలత ఆధ్వర్యంలో రాయచోటి డివిజన్ పరిధిలోని సుండుపల్లె, సంబేపల్లె, చిన్నమండెం, రాయచోటి మండలాలకు చెందిన వ్యవసాయశాఖ అధికారులు, క్షేత్రస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని యాంత్రీకరణ చేసే క్రమంలో రైతుల భాగస్వామ్యంతో మందుల పిచికారి యంత్రాలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మండలానికి రూ.9లక్షల చొప్పున నాలుగు మండలాలకు రూ.36లక్షలతో యంత్రాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ యంత్రాలను సబ్సిడీతో అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఎంపిక చేసుకొనే యంత్రాల పద్ధతి (ధరల) ప్రకారం సబ్సిడీ వర్తిస్తుందని చెప్పారు. పీఎం కిసాన్ లబ్ధికోసం రైతులు ఇప్పటి వరకు 80 శాతం రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఇంకా 20 శాతం మంది రైతులు చేసుకోలేదని, వారి కోసం ఈ నెల 8వ తేదీ వరకు గడువు పెంచినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అలాగే కందులకు మద్దతు ధర కల్పించినట్లు ఆయన తెలిపారు. క్వింటా ధర రూ.7550లతో జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తోందని తెలిపారు. దీని కోసం రైతులు రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలన్నారు.

హార్సిలీహిల్స్‌కు సందర్శకుల తాకిడి



గాలిబండపై పర్యాటకులు

మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ సందర్శకులతో పోటెత్తింది. రంజాన్ పండుగ తర్వాత ముస్లింలు సేద తీరేందుకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అన్నమయ్య, అనంతపురం, వైఎస్సార్ కడప, శ్రీ సత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి సందర్శకులు తరలివచ్చారు. దీనితో కొండపై రోడ్లన్నీ కిటకిటలాడాయి. ప్రకృతి సందర్శన ప్రాంతాలు, అటవీ ప్రాంగణం, వ్యూ పాయింట్లు నుంచి ప్రకృతి అందాలను తిలకించారు. నూతన ఏడాది రోజు తర్వాత ఇంతటి రద్దీ మంగళవారమే కనిపించింది.

–బి.కొత్తకోట

వామ్మో.. ఎలుగుబంటి



అట్లూరు మండల పరిధిలోని కొండూరు గ్రామంలో ఎలుగుబంటి సంచారం గ్రామస్తులను హడలెత్తిస్తోంది. అసలే ఎండలు ఆపై ఉక్కపోత తట్టుకోలేక రాత్రివేళల్లో గ్రామస్తులు ఆరు బయట నిద్ర పోతున్నారు. ఈ నేపథ్యంలో గత నాలుగు రోజులుగా నల్లకుంట చెరువు లోని కంప చెట్ల నుంచి రాత్రి వేళల్లో ఎలుగుబంటి వీధుల్లోకి వస్తోంది. దీంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

–అట్లూరు

ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలే లక్ష్యం

జిల్లా కలెక్టర్ శ్రీధర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా పంచ ప్రాధాన్యాల లక్ష్యాన్ని నిర్దేశించిందని, ఈ మేరకు వివిధ అభివృద్ధి పథకాలను చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా నిర్దేశించిన పంచ ప్రాధాన్యాలలో భాగంగా పశువుల నీటి తొట్ల నిర్మాణం చేపట్టడం, లక్ష్యం మేరకు ఫారంపాండ్‌ల నిర్మాణం, పంట కాలువల పూడిక తీత, సాగునీటి చెరువులలో పూడిక తీత, ఉపాధి కూలీలకు సగటు వేతనం రోజుకు కనీసం రూ. 290లు ఉండేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు 2025–26లో మొదటి త్రైమాసికానికి రూ. 266 కోట్ల లక్ష్యంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు.

రూ. 243.74 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి......

2024–25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ నిధులు అనుసంధానంతో రూ. 243.74 కోట్లు ఖర్చుతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేసుకున్నాయని కలెక్టర్ వివరించారు. వివిధ విభాగాలలో అభివృద్ధి పనులు పూర్తి చేసుకొని ప్రగతిలో రాష్ట్రంలో జిల్లాకు మూడవ స్థానం సాధించామన్నారు.

ఉపాధితో జీవనోపాధి

జిల్లాలో ఉపాధి పథకాన్ని పటిష్టంగా అమలు చేసి జీవనోపాధులను వృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. ఇందులో భాగంగా గత ఏడాది రూ. 308.47 కోట్లు ఉపాధి నిధులను ఖర్చు చేశామన్నారు. ఇందులో 88 లక్షల పనిదినాలు ఉపాధి కల్పించి వేతనాలు కింద దాదాపు రూ. 230 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ రూ. 78.47 కోట్లు చెల్లించి 95 శాతం ప్రగతి సాధించినట్లు పేర్కొన్నారు.

రూ. 7.95 కోట్లతో నీటి ఎద్దడి నివారణకు ప్రణాళిక ప్రతిపాదనలు

జిల్లాలో నీటి ఎద్దడి నివారించడానికి రూ. 7.95 కోట్లతో కంటి న్యూజెన్సీ ప్రణాళికను ప్రభుత్వానికి ప్రతిపాదించామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం 116 గ్రామాలలో నీటి సరఫరా జరుగుతోందన్నారు. వేసవి దృష్ట్యా రాబోయే కాలంలో గ్రామాలలో నీటి ఎద్దడి నివారించడానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్అండ్‌బీ ద్వారా ఏడీబీ పథకం కింద జిల్లాలో 380 కిలోమీటర్ల మేర ప్రాధాన్యత రోడ్లు ప్రతిపాదించినట్లు తెలిపారు. సమావేశంలో డ్వామా పీడీ వెంకటరత్నం, పంచాయతీ రాజ్ ఎస్ఈ దయాకర్ రెడ్డి పాల్గొన్నారు.

నీటి తొట్లు నిర్మించాలి

సంబేపల్లె: వేసవికాలంలో పశువులకు దాహార్తిని తీర్చేందుకు పల్లెలలో నీటి తొట్లు, ఫారంపాండ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాగిరెడ్డిగారిపల్లె పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద నీటి నిల్వతొట్లు, ఫారంపాండ్లు నిర్మించేందుకు కలెక్టర్ భూమి పూజ నిర్వహించారు.

స్పందన సమస్యలపై కలెక్టర్ పరిశీలన

కలకడ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (స్పందన) లో వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ ఫణికుమార్‌ను కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో కలకడ మండలం పెండ్లిమర్రివాండ్లపల్లె గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య భార్య వై.సుబ్బమ్మ తనకు రావాల్సిన సర్వేనెంబర్ :982–4లోని 0.04సెంట్లు భూమిని అదే గ్రామానికి చెందిన వ్యక్తులు ఆక్రమించారని ఆరోపించింది. స్పందించిన కలెక్టర్ మంగళవారం స్వయంగా సమస్య ఉన్న భూమి వద్దకు వచ్చి రెవిన్యూ రికార్డులను, భూమి తనిఖీ చేశారు. నివేదికలు అందజేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

రైల్వేస్టేషన్లకు కొత్తకళ!

- మారనున్నాయ్... మన రైల్వేస్టేషన్లు!
- అమృతభారత్ పథకంతో శ్రీకారం
- మదనపల్లె, పీలేరు, రాజంపేటలో ఆధునికీకరణ పనులు

రాజంపేట: అన్నమయ్య జిల్లాలోని పలు రైల్వే స్టేషన్ల రూపురేఖలు మారనున్నాయి. ప్రయాణీకుల రద్దీ ఎక్కువగా ఉన్నవాటిని ఆధునీకరించే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం అమృత్‌భారత్ స్టేషన్ పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. ప్రయాణీకులకు మెరుగైన వసతులు కల్పించే విధంగా స్టేషన్లను ఆధునీకరణ చేస్తున్నారు.

- అమృత్‌భారత్ పథకం కింద అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలో కడప, రాజంపేట, మదనపల్లె, పీలేరు రైల్వేస్టేషన్లలో ఆధునీకరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రయాణీకుల సౌకర్యాల కల్పన దిశగా ప్లానింగ్ చేసిన నేపథ్యంలో చకచకా పనులు కొనసాగుతున్నాయి. అత్యాధునిక ఆర్కిటెక్చర్, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నారు. రాజంపేటకు రూ.5.53 కోట్లు, మదనపల్లెకు రూ.8 కోట్లు, పీలేరు రూ.55 లక్షలు కేటాయించారు.

ప్రధాన సౌకర్యాలు ఇవే..

రాజంపేట, పీలేరు రైల్వేస్టేషన్లలో భవనాలు, ఫ్లోరింగ్ ఆధునికశైలితో నిర్మితం చేయనున్నారు. ప్లాట్‌ఫాం పొడవును కూడా పెంచనున్నారు. 600 మీటర్ల ఉన్న ప్లాట్‌ఫాంలు 760 మీటర్ల నుంచి 840 మీటర్ల వరకు పొడిగించే అవకాశాలున్నాయి. స్టేషన్లలో రైలుపట్టాల పరిశుభ్రత కోసం బ్యాలస్టలెస్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తారు. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా వీల్‌చైర్లు, ప్రత్యేక ప్రవేశమార్గాలు, ఇతర సదుపాయాలు ఉంటాయి. వెయిటింగ్ హాల్స్, వాటికి అనుబంధంగా కేఫెటేరియా, స్థానిక ఉత్పత్తుల విక్రయానికి కనీసం రెండుస్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి స్టేషన్ మొదటి అంతస్తులో ప్రత్యేకంగా రూఫ్‌ప్లాజా, సమావేశ మందిరాలు నిర్మితం చేయనున్నారు. స్టేషన్‌కు రెండువైపులా అప్రోచ్‌రోడ్లు, పార్కింగ్ ఏరియా, పాదచారులకు ప్రత్యేక దారి – ల్యాండ్ స్కేపింగ్, ఆధునిక లైటింగ్, వేగవంతమైన వైఫై సేవలకు 5 జీ టవర్లు ఏర్పాటు చేసే దిశగా మాస్టర్ ప్లాన్ కొనసాగనున్నది.



అమృత్ భారత్ కింద ఎంపికైన రాజంపేట రైల్వేస్టేషన్‌లో నిర్మాణంలో ముఖద్వారం పనులు

స్టేషన్ల అభివృద్ధిపై ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక దృష్టి

రాజంపేట, మదనపల్లె, పీలేరుతోపాటు పలు రైల్వేస్టేషన్ల అభివృద్ధిపై రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. అమృత్‌భారత్ పథకం కింద పీలేరు, రాజంపేట రైల్వేస్టేషన్ల ఎంపికకు తన వంతు కృషిచేశారు. అలాగే స్టేషన్‌లలో ప్రయాణీకులకు మెరుగైన సదుపాయాల కల్పన పూర్తి స్థాయిలో ఉండాలన్నదే ఎంపీ అభిమతంగా కనిపిస్తోంది. జిల్లాలో రాజంపేట, పీలేరు స్టేషన్లు న్నాయి. ఈ పథకం కింద 53 రకాల సదుపాయాలతో స్టేషన్ల సమగ్ర అభివృద్ధికి రైల్వేశాఖ చర్యలు చేపట్టేందుకు తన వంతుగా కృషిచేస్తున్నారు.

అమృత్ భారత్ నిధులు

రాజంపేట: రూ.5.53 కోట్లు

మదనపల్లె : రూ.8.కోట్లు

» స్టేషన్ల చరిత్ర..

రాజంపేట: తొలితెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య జన్మస్థలం తాళ్లపాక, పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రం, భక్తకన్నప్ప జన్మస్థలం.

మదనపల్లె: మదనపల్లె రోడ్ శానిటోరియం, బీటీ కాలేజ్, సబ్ కలెక్టరేట్, 150 ఏళ్లకుపైబడిన చర్చి.

రైల్వేస్టేషన్ల అభివృద్ధికి అమృత్ భారత్ ఒక వరం



జిల్లాలో రాజంపేట, మదనపల్లె స్టేషన్ల అభివృద్ధిపై దృష్టి సారించారు. రాజంపేట స్టేషన్ ముఖ ద్వారంపై అన్నమయ్య విగ్రహంను ఏర్పాటు చేస్తున్నారు. అమృత్ భారత్ జాబితాలో రాజంపేట, పీలేరు, మదనపల్లె స్టేషన్లు చేరేలా ఎంపీ మిథున్‌రెడ్డి కృషి చేశారు. ఈ పథకం ఓ వరం. ప్రతి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పన ఉండాలని రైల్వేశాఖను ఎంపీ కోరుతున్నారు. – తల్లెం భరత్ కుమార్‌రెడ్డి, సభ్యుడు, గుంతకల్ డీఆర్‌యుసీసీ

రాజంపేట రైల్వేస్టేషన్‌లో అధునాతన సౌకర్యాలు



ఎంపీ మిథున్‌రెడ్డి కృషితో అమృత్‌భారత్ పథకం కింద ఎంపికైన రాజంపేట రైల్వేస్టేషన్‌లో అధునాతన సౌకర్యాలు కల్పించేందుకు పనులు జరుగుతున్నాయి. ఇది శుభపరిణామం. పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో అన్ని రైళ్ల హాల్టింగ్‌కు ఎంపీ కృషిచేస్తున్నారు. అన్నమయ్య రాజంపేట రైల్వేస్టేషన్‌గా పేరు మార్చేలా రైల్వేశాఖ కృషి చేయాలి. – మర్రి రవికుమార్, వైస్‌ఛైర్మన్, మున్సిపాలిటి, రాజంపేట

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతుడు వెంకటరమణ

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని గాంధీరోడ్‌లో లీలావతి ఆస్పత్రి ఎదురుగా రెండవ అంతస్తులో నివాసముంటున్న పెనుబాల వెంకటరమణ (45) మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. క్షవర వృత్తి చేసుకుంటూ జీవనం సాగించే వెంకటరమణ అతిగా మద్యం తాగి మృతి చెంది ఉండవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు. కాని చెవులు, ముక్కులలో నుంచి రక్తం రావడంతో అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి భార్య చాముండేశ్వరి, కుమారులు గోపీచంద్, దినేష్ ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించి.. చికిత్స పొందుతూ..


మృతుడు సుబ్బరాయుడు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని అనంతరాజుపేట వడ్డిపల్లికి చెందిన చామల సుబ్బరాయుడు(50) అనే వ్యక్తి ఆత్మహత్యకు యత్నించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మానసిక స్థితి సరిగా లేక గత నెల 23న విషద్రావణం తాగాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య వెంకటసుబ్బమ్మ ఉంది. కుటుంబ కలహాల నేపథ్యంలో గత కొన్ని రోజులు మానసికంగా కుంగి పోయాడని స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సిలిండర్ లారీ బోల్తా


సిలిండర్ లారీ బోల్తా పడటంతో ప్రమాదం నివారణకు చర్యలు చేపట్టిన అగ్నిమాపక సిబ్బంది

సంబేపల్లె : చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారిపై సంబేపల్లె వద్ద మంగళవారం తెల్లవారుజామున గ్యాస్ సిలిండర్ లారీ బోల్తా పడింది. పోలీసుల వివరాల మేరకు కడప నుంచి సిలిండర్ ఫుల్ లోడుతో నిమ్మనపల్లెకు వెళుతున్న లారీ మండల కేంద్రంలోని వడ్డపల్లె క్రాస్ రోడ్డు సమీపంలోకి రాగానే అదుపు తప్పి డివైడర్ ఎక్కడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ శివకు గాయాలయ్యాయి. లారీ బోల్తా పడిన సమయంలో సిలిండర్లు చెల్లాచెదురుగా పడ్డాయి. సమాచారం తెలుసుకున్న సంబేపల్లె పోలీసులు, అగ్నిమాపక అధికారి వెంకట్రామిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

కోర్టు కాంప్లెక్స్‌కు 'రెవెన్యూ' గ్రహణం!

- రెవెన్యూకు న్యాయశాఖ భవనాలు అప్పగింత
- న్యాయశాఖకు అప్పగించని తహసీల్దార్ భవనం
- కోర్టు కాంప్లెక్స్ ఒప్పందానికి పన్నెండేళ్లు!


న్యాయశాఖకు అప్పగించాల్సిన తహసీల్దారు కార్యాలయ భవనం


కోర్టు కాంప్లెక్స్ ఒప్పందం గురించి జిల్లా జడ్జికి వివరిస్తున్న న్యాయవాదులు (ఫైల్)

రాజంపేట : రాజంపేట కోర్టు భవనాల సముదాయం అభివృద్ధికి సంబంధించి న్యాయశాఖ, రెవెన్యూ శాఖ మధ్య కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా రెవెన్యూ గ్రహణానికి పన్నెండేళ్లైంది. న్యాయశాఖ తన వంతుగా సబ్‌కలెక్టరేట్‌లో ఉన్న న్యాయశాఖ భవనాల(సబ్‌జడ్జి క్వార్టర్స్, భవనాలు)ను రెవెన్యూకు అప్పగించింది. అయితే న్యాయశాఖకు ఇవ్వాల్సిన తహసీల్దారు కార్యాలయం భవనం ఇప్పటి వరకు అప్పగించకపోవడంతో .. మేము ఇచ్చాము..మీరెప్పుడు ఇచ్చేదంటున్నారు రాజంపేట బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు.

2013లో ఒప్పందం ఇలా..

2013లో అప్పటి కలెక్టర్, జడ్జిలు కోర్టు కాంప్లెక్స్ ఏర్పాటులో భాగంగా కోర్టు ఆవరణంలో ఉన్న తహసీల్దారు కార్యాలయం తీసుకుని, ఇందుకుగాను ఆర్డీఓ కార్యాలయంలో ఉన్న న్యాయశాఖ భవనాలను అప్పగించేలా ఒప్పందం చేసుకున్నారు. అప్పట్లో కోర్టు భవనాల నిర్మితం కోసం స్థలం విషయంలో రాజంపేట బార్ అసోసియేషన్ హైకోర్టులో రిట్‌కూడా దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో అప్పటి కలెక్టర్, హైకోర్టు ఆదేశాలతో గతంలో చేసుకున్న ఒప్పందం అమలుకు నిర్ణయం తీసుకున్నారు. కాని అమలు విషయంలో కాలం కొనసాగుతూ వస్తోంది.

నూతన జిల్లా ఆవిర్భావంతో.. అటకెక్కిన ఒప్పందం..

వైఎస్సార్ కడప జిల్లా పరిధిలో ఉన్నప్పుడు రెవెన్యూ, న్యాయశాఖ మధ్య జరిగిన ఒప్పందం నూతనంగా అన్నమయ్య జిల్లా ఏర్పడిన తర్వాత అటకెక్కింది. రాజంపేట అన్నమయ్య జిల్లా పరిధిలోకి వెళ్లిపోవడంతో ఈ ఒప్పందం అమలు చేసే విషయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. జిల్లా ఏర్పడకముందు కోర్టు కాంప్లెక్స్ ఒప్పందం ఒక కొలిక్కి వచ్చిన సంగతి తెలిసిందే. రికార్డుపరంగా తహసీల్దారు కార్యాలయానికి ఇచ్చినట్లుగా న్యాయవాదులు చెబుతున్నారు. అయితే భౌతికంగా అప్పగించలేదన్న వాదన బార్ అసోసియేషన్ వినిపిస్తోంది.

కక్షిదారుల సౌకర్యాలు.. నూతన భవనాలు నిర్మితమెప్పుడో..

రాజంపేట కోర్టు క్లాంపెక్స్ ఒప్పందంలో భాగంగా కాంప్లెక్స్ నిర్మితం చేయాలని రాజంపేట బార్ అసోసియేషన్ అప్పటి అధ్యక్షుడు కె.శరత్‌కుమార్‌రాజు ప్రయత్నించారు. ఇందులో భాగంగా కక్షిదారులకు మెరుగైన సౌకర్యాలు, నూతన భవనాలు, బార్ అసోసియేషన్ భవనం లాంటివి నిర్మితం చేసుకునేందుకు ప్రభుత్వం నుంచి బడ్జెట్ విడుదల చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. అయితే కోర్టు కాంప్లెక్స్ ఒప్పందం పూర్తిగా అమలు కాకపోవడంతో పెండింగ్ పడిపోయింది.

కోర్టు కాంప్లెక్స్ ఒప్పందం న్యాయశాఖ అమలు చేసింది



రెవెన్యూ, న్యాయశాఖ కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా సబ్ కలెక్టరేట్‌లో న్యాయశాఖ భవనాలను రెవెన్యూకు అప్పగించింది. అయితే కోర్టు కాంప్లెక్స్‌లో ఉన్న తహసీల్దారు కార్యాలయం ఇంతవరకు న్యాయశాఖకు అప్పగించలేదు. ఇది అప్పటి కడప కలెక్టర్, జిల్లా జడ్జిలు సమన్వయంగా తీసుకున్న నిర్ణయం. హైకోర్టు ఆదేశం మేరకు ఒప్పందం జరిగి 12 ఏళ్లు అవుతోంది. ఇప్పటికైనా రెవెన్యూ స్పందించాలి. తహసీల్దారు కార్యాలయం అప్పగించిన వెంటనే రాజంపేట కోర్టుకు నూతన భవనాలు, కక్షిదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాము.

\- కొండూరు శరత్‌కుమార్‌రాజు, మాజీ అధ్యక్షుడు, బార్ అసోసియేషన్

తహసీల్దారు కార్యాలయం అప్పగింతలో రెవెన్యూ జాప్యం



కోర్టు కాంప్లెక్స్ ఒప్పందం మేరకు తహసీల్దారు కార్యాలయం అప్పగింత విషయంలో రెవెన్యూ జాప్యం చేస్తోంది. రికార్డుపరంగా ఇస్తే ఏమీ లాభం లేదు. తహసీల్దారు కార్యాలయం అప్పగిస్తే ఉన్న స్థలంలో కోర్టు నూతన భవనాలను నిర్మితం చేసుకోవచ్చు. ప్రభుత్వ పెద్దల సహకారంతో నిధులు కేటాయించుకునేందుకు వీలవుతుంది.

\-హనుమంతనాయుడు, అధ్యక్షుడు, బార్ అసోసియేషన్, రాజంపేట

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో జైలు శిక్ష


నిందితుడితో పోలీసులు

సుండుపల్లె : ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ..3 లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి తీర్పు చెప్పినట్లు సానిపాయి ఫారెస్ట్ రేంజ్ అధికారి వై.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వివరాలలోకి వెళితే.. 2019 వంగిమళ్ల సెక్షన్ సరస్వతిపల్లి బీట్ సమీపంలోని పత్తి కనుమ రస్తాలో ఒక సుమోలో నాలుగు ఎర్రచందనం దుంగలను అక్రమంగా రవాణా చేస్తున్న డ్రైవర్ సత్యమోహన్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి లక్కిరెడ్డిపల్లి కోర్టులో హాజరు పరిచామన్నారు. నిందితుడిని రాయచోటి సబ్ జైలుకు మంగళవారం తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ శ్రీరాములు, ఎఫ్‌బీఓ భరణికుమార్, రఘుపతిరాజు, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

పోరుమామిళ్ల : మండలంలోని రాజాసాహెబ్‌పేట పంచాయతీ తిరువెంగళాపురానికి చెందిన కల్లూరి రామతులసి(25) మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. వివాహ సంబంధాల విషయంలో ఆమె తీవ్ర అసంతృప్తితో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు తండ్రి జయరామిరెడ్డి పోలీసులకు తెలిపారు.

ఒంటిమిట్ట కోదండరాముడికి కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం


బలిపీఠాన్ని శుద్ధి చేస్తున్న అర్చకులు వీణా రాఘవాచార్యులు, శ్రావణ్ కుమార్


ఆలయంలోనికి తీసుకువస్తున్న సుగంధ ద్రవ్యాలతో కూడిన పవిత్ర జలాలు

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. ఆలయంలో ఏప్రిల్ 6వ తేదీ నుంచి 14వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్న విషయం విదితమే. బ్రహ్మోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి అర్చన నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఇందులో భాగంగా గర్భాలయం, శ్రీ భక్త సంజీవరాయస్వామి ఆలయం, శ్రీ గరుత్మంతుని సన్నిధి, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం భక్తులకు ఉదయం 11.30 గంటల నుంచి సర్వదర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నటేష్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరకు పటిష్ట బందోబస్తు

అర్బన్ సీఐ రాజ



రాజంపేట టౌన్ : పట్టణంలోని బలిజపల్లెలో గురువారం జరగనున్న గంగమ్మ జాతరకు ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే ఆదేశాల మేరకు పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు అర్బన్ సీఐ పి.రాజ తెలిపారు. స్థానిక తన కార్యాలయంలో మంగళవారం గంగమ్మ జాతరకు సంబంధించిన పోలీసు బందోబస్తు వివరాలను సీఐ వెల్లడించారు. జాతరను పురస్కరించుకొని బుధవారం సాయంత్రం నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు బలిపల్లె గ్రామం పోలీసుల ఆధీనంలో ఉంటుందన్నారు. ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలు, పలువురు హెడ్ కానిస్టేబుళ్లు, 80 మంది పోలీసులు, స్పెషల్ పార్టీ బృందాలు బందోబస్తుగా ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా చైన్‌స్నాచర్స్, పిక్‌ప్యాకెటర్ల ఆట కట్టించేందుకు క్రైం పార్టీ పోలీసులు ఇటు జాతరలోనే కాక పట్టణంలో కూడా మఫ్టీలో తిరుగుతూ ఉంటారన్నారు. జాతర ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు నిర్వాహకులతో పాటు భక్తులు కూడా పోలీసు శాఖకు సంపూర్ణంగా సహకరించాలని కోరారు. ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా, భక్తులకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భక్తులకు ఎవరి వల్ల అయినా సమస్యలు తలెత్తితే తగాదాలు పెట్టుకొని ఘర్షణలకు దిగకుండా వెంటనే దగ్గరలో ఉండే పోలీసులకు తెలియజేయాలన్నారు.

సీసీ కెమెరాల నిఘాలో జాతర

గంగమ్మ జాతర మొత్తం సీసీ కెమెరాల నిఘాలో ఉంటుందన్నారు. జాతరను పురస్కరించుకొని బుధవారం రాత్రి నుంచే భక్తులు బలిజపల్లె గ్రామానికి చేరుకోనున్నందున బుధవారం నుంచి శుక్రవారం తెల్లవారుజామున అమ్మవారు పొలిమేర్లకు వెళ్లే వరకు జాతర మొత్తం నిఘా నీడలో ఉంటుందని తెలిపారు.

బంగారు నగలు తక్కువగా ధరించి రావాలి

జాతరకు వచ్చే భక్తులు బంగారు నగలను తక్కువగా ధరించి రావాలని సీఐ రాజ భక్తులను కోరారు. బంగారు చైన్లు వేసుకునేవారు అవి బయటకు కనిపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నగదు కూడా అవసరం మేరకు మాత్రమే తెచ్చుకోవాలని సూచించారు. పొరపాటున చిన్నపిల్లలు ఎవరైనా తప్పిపోతే వెంటనే దగ్గరలో ఉన్న పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

మూడు మార్గాల్లో వెహికల్ పార్కింగ్

వాహనాల్లో వచ్చే భక్తుల కోసం మూడు మార్గాల్లో పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించినట్లు సీఐ రాజ తెలిపారు. నూనెవారిపల్లె వైపు నుంచి వచ్చే వారికి రాజు స్కూల్ వెనుకవైపు ఉన్న ఖాళీ స్థలంలో, అలాగే రైల్వే స్టేషన్ ప్రాంతం నుంచి గంగిరెడ్డిపాళెం మీదుగా వచ్చే వారికి బలిజపల్లె టర్నింగ్ వద్ద, మన్నూరు వైపు నుంచి వచ్చే భక్తులకు నారపురెడ్డిపల్లె ప్రాంతంలో వెహికల్ పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించనున్నట్లు తెలిపారు. జాతరలోకి ఎట్టి పరిస్థితుల్లో వాహనాలను అనుమతించేది లేదని తెలిపారు.

న్యాయం కోసం కలెక్టర్‌కు వినతి

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి పట్టణం ఎన్‌జీఓ కాలనీలో ఉన్న తన ఇంటికి సంబంధించి తప్పుడు హద్దులు సృష్టించి సొసైటీ ప్రెసిడెంట్ జయచంద్ర తనకు అన్యాయం చేశాడంటూ బాధితురాలు పాపిరెడ్డి బసమ్మ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్‌జీఓ కాలనీలో గల తన భూమికి 53/40 అడుగులతో ప్లాట్ నంబర్ 36ను సదిపిరాళ్ల వెంకటసుబ్బారెడ్డి వద్ద నుంచి 26.6.2024న కొనుగోలు చేశానన్నారు. కానీ ఎన్‌జీఓ సొసైటీ ప్రెసిడెంట్ జయచంద్ర తన ఇంటికి తప్పుడు హద్దులతో రోడ్డు వెడల్పును తగ్గించి చిన్ననరసింహులుకు విక్రయించగా అతని వద్ద నుంచి టీచర్ పొట్టిరెడ్డిగారి పొట్టిరెడ్డి కొనుగోలు చేశారన్నారు. తనకు జరిగిన అన్యాయాన్ని పొట్టిరెడ్డికి పలుమార్లు విన్నవించినా పెడచెవిన పెట్టగా కోర్టును కూడా ఆశ్రయించానన్నారు. దీంతో పొట్టిరెడ్డి నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నాడని ఆమె ఆరోపించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ స్పందించి తనకు న్యాయం చేయాలని ఆమె వేడుకున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బర్మావీధికి చెందిన వంశీకుమార్(24) సొంత ఆటో నడుపుతూ పాలక్యానులు రవాణా చేస్తుంటాడు. మంగళవారం పాలు తీసుకుని ఇసుకనూతిపల్లె వద్ద ఉన్న డెయిరీకి ఆటోలో వెళుతుండగా, బైపాస్‌రోడ్డులోని వెన్నెల రెస్టారెంట్ సమీపంలో చెరువు వద్ద పట్టణంలోని సైదాపేటకు చెందిన ఖాజాపీర్(55) బొలెరో వాహనంతో వచ్చి ఆటోను ఢీకొన్నాడు. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడగా, స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా మండలంలోని పనసమానుకుంటకు చెందిన ఈశ్వరప్ప(42) మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని మంగళవారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా, బొమ్మన చెరువు సమీపంలో ఎదురుగా వచ్చిన జీపు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో తలకు గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు బాధితుడిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఇద్దరు వ్యక్తులపై కత్తితో దాడి

ఒకరి పరిస్థితి విషమం



కత్తి దాడిలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులు, సురేంద్రబాబు

మదనపల్లె : ఓ వ్యక్తి మరో ఇద్దరు వ్యక్తులపై కత్తితో దాడికి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. బాధితుల కథనం మేరకు వివరాలు.. పట్టణంలోని రామ్ నగర్ లో నివాసం ఉన్న శ్రీనివాసులు (37), కమ్మి పని చేస్తూ జీవిస్తుండగా, సురేంద్రబాబు(38) సాయిబాబా గుడి సమీపంలో దుకాణం నిర్వహిస్తున్నాడు. వీరిద్దరు స్నేహితులు కాగా, మంగళవారం రాత్రి భోజనం పూర్తి చేసి, స్థానికంగా ఉన్న పార్కు వద్దకు చేరుకున్నారు. అక్కడే కూర్చొని పిచ్చాపాటి మాట్లాడుకుంటూ ఉండగా, వారికి పరిచయస్తుడైన పట్టణంలోని కమ్మగడ్డ వీధికి చెందిన వేణుగోపాల్ పూటుగా మద్యం సేవించి వారి వద్దకు వచ్చాడు. ఒక్కసారిగా తన వెంట తెచ్చుకున్న కత్తితో, శ్రీనివాసులు, సురేంద్రబాబులపై విచక్షణ రహితంగా దాడి చేశాడు. గాయపడిన బాధితులు గట్టిగా అరవడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. దాడిని గుర్తించిన స్థానికులు నిందితుడైన వేణుగోపాల్ కు దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించి అప్పగించారు. అనంతరం గాయపడిన బాధితులను ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న టూ టౌన్ సీఐ రామచంద్ర ఆస్పత్రికి చేరుకొని ఘటనకు కారణాలను బాధితులు అడిగి తెలుసుకున్నారు. వేణుగోపాల్ తమకు పరిచయస్తుడేనని అయితే దాడి ఎందుకు చేశాడో కారణం తెలియదని బాధితులు చెప్పారు. అత్యవసర విభాగంలో వైద్య చికిత్స అనంతరం శ్రీనివాసులు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. టూ టౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఈద్‌కు వచ్చి మృత్యు ఒడికి..

నిమ్మనపల్లె : ఈద్‌కు బంధువులతో కలిసి సరదాగా గడుపుదామని కర్ణాటక నుంచి వచ్చిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందిన ఘటన మంగళవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది.

కర్ణాటక హొస్కోటకు చెందిన చోటూ, షబ్బూ దంపతుల కుమారుడు ఆసిఫ్(23) లారీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. రంజాన్ పండుగ సందర్భంగా మదనపల్లె ఇందిరానగర్‌లోని బంధువుల ఇంటికి వచ్చాడు. సోమవారం రంజాన్ పండుగను బంధుమిత్రులతో కలిసి సంతోషంగా జరుపుకున్నాడు. మంగళవారం మదనపల్లెకు సమీపంలోని నిమ్మనపల్లె నమాజుకట్ట వద్దకు వెళ్లి వద్దామని బంధువులు, కుటుంబ సభ్యులు కోరడంతో దర్గాకు బయలుదేరి వెళ్లారు. అక్కడికి వెళ్లి దైవదర్శనం పూర్తిచేసుకున్న తర్వాత స్థానిక చెరువులో స్నేహితులతో కలిసి ఈత ఆడేందుకు వెళ్లాడు. కొద్దిసేపు సరదాగా ఈత ఆడి ఒడ్డుకు వచ్చి తిరిగి చెరువులోకి వెళ్లాడు. సోదరిని వీడియో తీయమంటూ నీళ్లలో మునిగాడు. అయితే నీళ్లలో మునిగిన వ్యక్తి ఎంతసేపటికి పైకి లేకపోవడంతో అతడితో పాటు నీళ్లలోకి దిగిన స్నేహితుడు లోనికి వెళ్లి గాలించాడు. చెరువు కింద నీటిలో ఉన్న బురదముళ్లలో ఇరుక్కుని ఆసిఫ్ పైకి రాలేకపోయాడని గ్రహించాడు. స్నేహితుడిని అతి కష్టం మీద ఒడ్డుకు తీసుకువచ్చి హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అత్యవసర విభాగ వైద్యులు ఆసిఫ్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. నిమ్మనపల్లె పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

పదో తరగతి విద్యార్థిని అదృశ్యం

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని కాకులవరం గ్రామానికి చెందిన పదోతరగతి విద్యార్థిని చివరిరోజు పదో తరగతి పబ్లిక్ పరీక్ష రాసి కనిపించలేదని బాలిక తల్లిదండ్రులు లక్కిరెడ్డిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి బాలిక కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ రవీంద్ర బాబు తెలిపారు.

కడప ఉక్కు పరిశ్రమపై స్పందించాలి

ప్రొద్దుటూరు : కడప ఉక్కు పరిశ్రమపై రాయలసీమ మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందించాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జగన్ తెలిపారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలో కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారన్నారు. 11 ఏళ్లు అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కడప ఉక్కు పరిశ్రమ గురించి పట్టించుకోవడం లేదన్నారు. కేవలం ఉక్కు పరిశ్రమను శంకుస్థాపనలకే పరిమితం చేశారన్నారు. రాయలసీమ ప్రజలను ఓట్లు, సీట్ల కోసం వాడుకుంటున్నారే తప్ప అభివృద్ధి చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు.

పీలేరులో భారీ చోరీ


చోరీ జరిగిన ఇళ్లను పరిశీలిస్తున్న ఎస్ఐ లోకేష్


రవీంద్ర నగర్‌లోని దుకాణంలో సరుకులను తీసుకెళ్లిన దొంగలు

పీలేరు : పీలేరు పట్టణంలో సోమవారం రాత్రి భారీ చోరీ జరిగింది. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పీలేరు పట్టణం తిరుపతి మార్గంలో శ్రీ చౌడేశ్వరి చేనేత నగర్‌లో నివాసం ఉంటున్న శ్రీనివాసులు, అశోక్‌కుమార్‌ల ఇళ్లు రెండు పక్కపక్కనే ఉన్నాయి. ఇరు కుటుంబాలు సోమవారం సాయంత్రం ఇళ్లకు తాళాలు వేసుకుని మదనపల్లెకు బంధువుల ఇంటికి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దుండగులు రాత్రి సమయంలో ఇళ్ల తాళాలు పగులగొట్టి లోనికి చొరబడ్డారు. రెండు ఇళ్లలో నగదుతో పాటు బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారు. దుండగులు చోరీకి పాల్పడినట్లు సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాలు ఆలస్యంగా గ్రహించిన బాధితులు దగ్గరలోని బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే దుండగులు ఉడాయించారు. సోమవారం ఉదయం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ లోకేష్, వేలిముద్ర నిపుణులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ రెండిళ్లలో సుమారు రూ. 10 లక్షల నగదు, అర కిలోకు పైగా బంగారు నగలు, మూడు కిలోల వెండి చోరీ అయినట్లు తెలిపారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని చౌటపల్లి పంచాయతీ రవీంద్ర నగర్‌లోని ఓ దుకాణంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు దుకాణంలోని రేకులు తొలగించి లోనికి చొరబడి రూ. 45 వేలు విలుగల సిగరేట్ ప్యాకెట్లు, కూల్ డ్రింక్స్, విలువైన వస్తువులను దొంగిలించినట్లు బాధితుడు పవన్ కుమార్ తెలిపారు. దుకాణంలో నాలుగు సీసీ కెమెరాలు అమర్చామని అయినా సోమవారం అర్ధరాత్రి 1.30 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేసి దుకాణంలోకి చొరబడి వస్తువులతోపాటు రూ. 5 వేలు నగదును ఎత్తుకెళ్లారన్నారు. అలాగే దక్కన్ టీ స్టాల్‌లో సిగరేట్ ప్యాకెట్లు, కూల్ డ్రింక్స్, రూ. 40 వేలు వస్తువులను అపహరించినట్లు బాధితులు తెలిపారు. ఈ రెండు దుకాణాల్లోనూ ఒకే రీతిలో చోరీలు జరగడం గమనార్హం.

కూటమి పాలన అంతా అస్తవ్యస్తం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.రమేష్ కుమార్ రెడ్డి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఆర్.రమేష్ కుమార్ రెడ్డి

రాయచోటి : పది నెలల కూటమి పాలనలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విమర్శలు చేయడం తప్ప రాష్ట్ర ప్రజలకు చేసిన అభివృద్ధి, సంక్షేమం శూన్యమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డెప్పగారి రమేష్ కుమార్ రెడ్డి విమర్శించారు. మంగళవారం రాయచోటిలోని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఈ సంవత్సర కాలంలో అమలు చేయకపోగా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని మాత్రం అమలు చేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించిన చంద్రబాబు నేడు పథకాల అమలుకు ఖజానా చూస్తే భయమేస్తోందని అసెంబ్లీ సాక్షిగా చెప్పడం మోసానికి పరాకాష్ట కాదా ప్రశ్నించారు. పీ 4, పీ 5 అని కొత్తగా ప్రజలను భ్రమ పెడుతున్నారని చెప్పారు. ఈ మాటలతో సాధించేది శూన్యం అన్నారు. తల్లికి వందనం పేరుతో రూ. 15 వేలు ఇస్తామని చెప్పి చంద్రబాబు మాట తప్పారన్నారు. అన్నమయ్య జిల్లాలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. గ్యాంగ్‌వార్‌ల దాడులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా జిల్లాలో మత సామరస్యం క్షీణించిందన్నారు. మత ఛాందసవాదులను నిలువరించడంలో ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. లక్కిరెడ్డిపల్లి జెడ్పీటీసీ ఇంటిపై దాడి చేస్తే ఇంతవరకు నిందితులను అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. ఈ ప్రభుత్వ పాలనలో జిల్లా కేంద్రంగా భూ కబ్జాలు, విపరీతమైన అవినీతి, ఇష్టారాజ్యంగా టెండర్లు వేసుకోవడం పెరిగిపోయాయన్నారు. రాయచోటి నియోజకవర్గంలోని సంబేపల్లె, రాయచోటి పట్టణం పాతగొల్లపల్లి తదితర ప్రాంతాల్లో జరిగిన భూ కబ్జాలపై విచారణ జరపకపోవడం విచారకరమన్నారు.కరువు పీడిత ప్రాంతమైన అన్నమయ్య జిల్లాను కరువు జిల్లాల జాబితాలో చేర్చకపోవడం అన్యాయమన్నారు.కూటమి పాలన వైఫల్యాలను పది నెలలు భరించామని ఇకపై అధికార పార్టీ నాయకుల అవినీతి అక్రమాలపై పోరాడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొలిమి హరూన్ బాషా, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ ఎస్కే హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.